క్లుప్తంగా

కలసికట్టుగా పనిచేయండి



జగనన్నను మర్యాద పూర్వకంగా కలిసిన కొండూరు వేణుగోపాల్‌రెడ్డి

హిందూపురం: నియోజకవర్గంలోని వైఎస్సార్‌ సీపీ నాయకులు కలిసికట్టుగా ఉంటూ కార్యకర్తలకు అండగా నిలవాలని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి సూచించారని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు కొండూరు వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. గురువారం అమరావతిలో జగన్‌ మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశామన్నారు. హిందూపురం నియోజకవర్గ పార్టీ పరిస్థితులు, ఇటీవల జరిగిన మున్సిపల్‌ చైర్మన్‌ ఎన్నికపై ఆయన అడిగి తెలుసుకున్నారన్నారు.

12 నుంచి పింఛన్‌ అర్హతల పునఃపరిశీలన

పరిగి: ఈనెల 12 నుంచి రూ.15 వేల పింఛన్‌దారుల అర్హతల పునఃపరిశీలించనున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్‌ తెలిపారు. వైద్యబృందం 12న హొన్నంపల్లి, పి నరసాపురం, పైడేటి, ఎర్రగుంట, బీచిగానిపల్లి, 13న కొడిగెనహళ్లి, మోదా, శ్రీరంగరాజుపల్లి, పరిగిలో పింఛన్‌దారుల స్థితిగతులను పరిశీలిస్తారన్నారు.

అన్నసంతర్పణలో భాగస్వాములు కండి



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: అన్నసంతర్పణలో భాగస్వాములుకావాలని సద్గురు యోగి నారాయణ సేవా సమితి అధ్యక్షుడు రవిశంకర్‌ కోరారు. 190వ అన్నదాన కార్యక్రమంలో భాగంగా గురువారం సేవాకర్తలుగా బిసలమానేపల్లి బాలకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు సేవ అందించడంతో వందలాది మందికి రైల్వేస్టేషన్‌ రోడ్డులో అన్నసంతర్పణ జరుగుతోంది. దాతలకు శ్రీ క్షేత్రం కైవారం తాతయ్య ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నామన్నారు.

అబ్దుల్‌ గఫార్‌ ఖాన్‌ జయంతి



మాట్లాడుతున్న చైర్మన్‌ రమేష్‌కుమార్‌

హిందూపురం: హిందూ ముస్లింల ఐక్యతతోనే దేశాభివృద్ధి సాధ్యమని చాటి చెప్పిన మహనీయుడు ఖాన్‌ అబ్దుల్‌ గఫార్‌ఖాన్‌ అని మున్సిపల్‌ చైర్మన్‌ రమేష్‌కుమార్‌, కమిషనర్‌ శ్రీనివాసులు కొనియాడారు. భారతరత్న అబ్దుల్‌ గఫార్‌ ఖాన్‌ జయంతి వేడుకలను లింగంపల్లి రోడ్డులోని ఖాన్‌ అబ్దుల్‌ గఫార్‌ ఖాన్‌ ఉర్దూ పాఠశాల ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రారంభించి వందేళ్లు అయిన సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే కేక్‌ కట్‌ చేసి, పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సబిహాబాను, ఇన్‌చార్జ్‌ ఫాజిల్‌, అబ్మత్‌ మాజీ మున్సిపల్‌ చైర్మన్‌ అనిల్‌, ఎంఈఓ గంగప్ప, కౌన్సిలర్‌ ఆయుబ్‌ తదితరులు పాల్గొన్నారు.


హనుమంత వాహనంపై పేట వేంకటరమణుడు



హనుమంత వాహనంపై ఊరేగుతున్న వేంకటరమణుడు

హిందూపురం: హిందూపురం మెయిన్‌ బజారులోని ప్రముఖ పేట వేంకటరమణ స్వామి బ్రహ్మోత్సవంలో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత పేట వేంకటరమణస్వామి హనుమంత వాహనంపై గురువారం దర్శనమిచ్చారు. మూలవిరాట్‌ను బంగారు కవచధారణతో విశేష అలంకరణతో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవతో శ్రీదేవి భూదేవి సమేత వెంకటరమణ స్వామిని అలంకరించి, అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయ ముఖమంటపంలో కొలువుదీర్చి తిరుమంజన సేవ చేశారు. ఉత్సవమూర్తులను హనుమద్‌ వాహనంపై కొలువుదీర్చి పురవీధుల గుండా ఊరేగించారు.

గుండెపోటుతో ఎస్‌ఎస్‌కే డైరెక్టర్‌ మృతి



సురేశ్‌ బాబు (ఫైల్‌)

పావగడ: స్థానిక శనిమహాత్మ కార్య నిర్వాహక సంఘం డైరెక్టర్‌ ఏఎస్‌ సురేశ్‌ బాబు (69) గుండెపోటుతో గురువారం ఉదయం మృతి చెందారు. పట్టణానికి చెందిన ఈయన 5 సంవత్సరాలుగా ఎస్‌ఎస్‌కే సంఘం డైరెక్టర్‌గా ఆలయ అభివృద్ధికి కృషి చేశారు. సురేష్‌ బాబు మృతిపై ఎస్‌ఎస్‌కే సంఘం అధ్యక్షుడు ఆనందరావ్‌, ఉపాధ్యక్షుడు అనిల్‌ కుమార్‌, కార్యదర్శి సుబ్బనరసింహ, ట్రెజరర్‌ మోహన్‌ కుమార్‌, మాజీ అధ్యక్షుడు కేవీ శ్రీనివాస్‌ తదితర డైరెక్టర్లు, సభ్యులు తీవ్ర సంతాపం తెలిపారు. మృతుడికి భార్య గిరిజ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సచివాలయ సిబ్బందిపై ఆంక్షల కత్తి !

> పరిగి మండలం గొరవనహళ్లిలో సచివాలయం పరిధిలో మోదా గ్రామం ఉంది. మోదాలో సర్వే చేయాలంటే మూడు కి.మీ దూరం రావాల్సి ఉంది. ఉదయం, సాయంత్రం బయోమెట్రిక్‌ హాజరువేయాలంటే సచివాలయ సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. బయోమెట్రిక్‌ వేయకపోతే జీతం కట్‌ అవుతుందని వారు ఆందోళన చెందుతున్నారు.

> రొద్దం మండలం నారనాగేపల్లిలో సచివాలయం ఉంది. దాని పరిధిలోని రాచూరు, జక్కలచెరువు, నాగిరెడ్డిపల్లి, కనుమర గ్రామాలు వస్తాయి. రాచూరు, జక్కలచెరువు గ్రామాలు సచివాలయానికి మూడు కి.మీ దూరంలో ఉంటాయి. దీని పరిధిలోని ఉద్యోగులు రెండుసార్లు బయోమెట్రిక్‌ వేయడానికి ఇబ్బంది పడుతున్నారు. మహిళా ఉద్యోగులు ఉన్న చోట మరిన్ని ఇక్కట్లు తప్పడం లేదు.

- హాజరు నిబంధనల్లో మార్పు
- వలంటీర్లుగా మారిపోయామంటున్న ఉద్యోగులు



పెనుకొండలోని గ్రామ సచివాలయం

పెనుకొండ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ ఉద్యోగులపై కూటమి ప్రభుత్వం ఆంక్షల కత్తిని దూస్తోంది. వలంటీర్‌ వ్యవస్థను పక్కన పెట్టేసిన చందంగా తమను ఆంక్షల సాకుతో మనోవేదనకు గురి చేస్తోందని సచివాలయ ఉద్యోగులు వాపోతున్నారు. రెండుసార్లు బయోమెట్రిక్‌ హాజరు వేయాలని, పింఛన్‌దారులకు 300 మీటర్ల సమీపంలో పింఛన్‌ ఇవ్వాలని, వివిధ సర్వేల భారం మోపుతూ వారిని పని ఒత్తిడికి గురి చేస్తోందని ఉద్యోగులు వాపోతున్నారు. గతంలో ఒకసారి బయోమెట్రిక్‌ వేసినా ఆ రోజు ఉద్యోగి విధులకు హాజరయినట్లే పరిగణించేవారు, కాని నేడు తప్పనిసరిగా రెండు సార్లు బయోమెట్రిక్‌ వేయాల్సిందే. లేనిపక్షంలో ఆ రోజు ఉద్యోగి విధులకు గైర్హాజరుగా పరిగణిస్తారు. జీతం తో కోత విధిస్తారు. ఇందుకు సంబంధించి సాఫ్ట్‌వేర్‌ను సైతం మార్చివేశారు. ఉదయం 10–30 గంటలకు ఒకసారి, అనంతరం సాయంత్రం 5 గంటల లోపు 2 సార్లు బయోమెట్రిక్‌ వేయాల్సిందే.

ఉద్యోగుల అభ్యంతరం..

కూటమి పెట్టిన నూతన ఆంక్షలపై సచివాలయ ఉద్యోగులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మామూలు సమయంలో రెండుసార్లు హాజరువేయడానికి తమకు అభ్యంతరం లేదని చెబుతున్నారు. అయితే ఒక్కోసారి సర్వేల నిమిత్తం గ్రామాలకు వెళ్లే సందర్భంలో సచివాలయానికి వచ్చి బయోమెట్రిక్‌ లేక ముఖ ఆధారిత హాజరు వేయడం కష్టతరమవుతుందని ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఒక సచివాలయ పరిధిలో 2, 3 గ్రామాలు ఉన్నపుడు ఆ గ్రామాలకు వెళ్లి మళ్లీ వచ్చి హాజరు వేయడం కష్టతరమవుతోందని వాపోతున్నారు. అదే విధంగా ఏ శాఖ ఉద్యోగులకు లేనివిధంగా తమకు ఐడెంటీ కార్డు ధరించి విధులకు హాజరుకావాలని, నిబంధనలు విధించారని ఆవేదన వ్యక్తం చేశారు. వలంటీర్ల స్థానంలో తమకు కూటమి ప్రభుత్వం అన్ని భాధ్యతలు కట్టబెట్టి ఇబ్బందులకు గురి చేస్తోందని వాపోతున్నారు. ఏ ఒక్క పొరబాటు జరిగినా జీతం కట్‌ అవుతుండడంతో ఉద్యోగులు బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికే ప్రతి మండలంలో ఉన్న సచివాలయ ఉద్యోగులు వివిధ కారణాలతో సెలవులు పెట్టడం, విధులకు హాజరుకాకపోవడం జరుగుతోంది. 40 శాతం మంది ఆయా మండలాల్లో లేరన్న అభిప్రాయాలు సచివాలయ ఉద్యోగుల్లో వ్యక్తమవుతున్నాయి.

పెనుకొండ నియోజకవర్గంలో సచివాలయాలు, ఉద్యోగుల వివరాలు..

మండలం	సచివాలయాలు	ఉద్యోగుల సంఖ్య
పెనుకొండ మున్సిపాల్టీ	07	47
పెనుకొండ రూరల్‌	10	92
సోమందేపల్లి..	14	120
పరిగి	17	148
రొద్దం..	15	146
గోరంట్ల..	20	162

నీటి ఎద్దటి రాకుండా చర్యలు తీసుకోండి



మండల పరిషత్‌ సర్వ సభ్యసమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్‌ : వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రత్నమ్మ అధికారులకు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రత్నమ్మ అధ్యక్షతన జరిగింది. ఎంపీటీసీలు సమావేశం దృష్టికి తెచ్చిన సమస్యలపై ఎంపీడీఓ శివకుమార్‌, అధికారులు సమాధానం చెప్పారు. మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ముందస్తు ప్రణాళికలతో పైప్‌ లైన్లు, బోరు మరమ్మతులు, ట్యాప్‌ల సమస్యలు తలెత్తితే స్పందించి పరిష్కరించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్‌ అధికారి వేణుగోపాల్‌ మాట్లాడుతూ ఇప్పటికే వేసవిని దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసి పంచాయతీల వారిగా తనిఖీలు చేస్తున్నామన్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించి రబీలో సాగు చేసే పంటలకు రైతులు ఈ క్రాప్‌ నమోదు బుకింగ్‌ నమోదు చేయించుకోవాలని ఏఈ సురేంద్ర నాయక్‌ తెలిపారు. పంచాయతీ రాజ్‌ పరిధిలో రూ.5.5 కోట్లతో సీసీ రోడ్లు , డ్రెయినేజీలు ఏర్పాటుకు ప్రతి పాదనలు ఉన్నతాధికారులకు పంపామని, వెంటనే పనులు చేపడతామని ఏఈ హనుమేనాయక్‌ తెలిపారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు ఎక్కడికక్కడ పనులు కల్పిస్తున్నామని ఉపాధిహామీ అధికారి లక్ష్మీబాయి తెలిపారు. ఎంఈఓ గంగప్ప మాట్లాడుతూ మండలంలో విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. సమావేశంలో వైస్‌ ఎంపీపీ రామాంజినప్ప, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

అమరాపురం: ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం సాగిస్తామని వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, రాష్ట్ర కుంచిటి వక్కలిగ అనుబంధ సంఘం అధ్యక్షుడు రంగేగౌడ్‌ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఆలదపల్లిలో జరిగిన కరియమ్మ ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం సర్పంచ్‌ గిరిజమ్మ స్వగృహంలో వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 8 నెలలు గడచినా ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. సూపర్‌ సిక్స్‌ హామీలతో రాష్ట్ర ప్రజలను వంచించారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అబద్ధాలు చెప్పడంలో సూపర్‌ అని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటామన్నారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పరిష్కరించేలా పోరాటం చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేశారని పేర్కొన్నారు. తల్లికి వందనం డబ్బు తల్లుల ఖాతాలకు జమ చేయలేదన్నారు. ఖరీఫ్‌ పోయి రబీ ముగిసిన రైతులకు సాయం అందించలేదని మండిపడ్డారు. బీసీలకు 50 సంవత్సరాలకు పింఛన్‌ ఇస్తామని చెప్పి ఇంతవరకు అమలుకు నోచుకోలేదన్నారు. 8 నెలలు గడచినా వితంతువులు, వృద్ధులకు కొత్త పింఛన్‌ మంజూరు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి హెచ్‌బీ.నరసేగౌడ్‌, సర్పంచులు, ఎంపీటీసీలు, జిల్లా ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు నరసింహ మూర్తి పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సి.రామచంద్రయ్య

హిందూపురం టౌన్‌: నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్‌ డిమాండ్‌ చేశారు. గురువారం పట్టణంలోని సాయిరాం ఫంక్షన్‌ హాల్‌లో సీపీఐ జిల్లా విస్తృతస్థాయి సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యుడు వినోద్‌ కుమార్‌ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ వెంటనే నెరవేర్చాలని అన్నారు. ఎనిమిది నెలలైనా కాలయాపన చేయడం సరికాదన్నారు. లేనిపక్షంలో ఇళ్ల నివేశ స్థలాలపై సీపీఐ ఆధ్వర్యంలో దశల వారీగా ఉద్యమం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కాటమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కేశవరెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మధు, అంజి, మహదేవ్‌, పవిత్ర, శ్రీరాములు, జిల్లా సమితి సభ్యులు పవన్‌, లియాకత్‌, బాలస్వామి, కదిరప్ప పట్టణ సహాయ కార్యదర్శి ఇస్మాయిల్‌, ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి యూనియన్‌ నాయకులు పాల్గొన్నారు.

కలసిమెలసి జీవించాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్‌ తహసీల్దార్‌ షేక్షావలి, ఎస్‌ఐ వీరాంజనేయులు

రొళ్ల: గ్రామాల్లో కుల వివక్ష చూపకుండా ప్రతి ఒక్కరూ అన్నదమ్ముల్లా కలసిమెలసి జీవించాలని ఇన్‌చార్జ్‌ తహసీల్దార్‌ షేక్షావలి, ఎస్‌ఐ వీరాంజనేయులు సూచించారు. గురువారం మండల పరిధిలోని మల్లినమడుగు గ్రామానికి చెందిన దళితులు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం సభ్యులతో కలిసి తహసీల్దార్‌ కార్యాయలం వద్ద ధర్నా చేపట్టారు.గ్రామాల్లో దళితులపై వివక్ష లేకుండా చూడాలని తెలిపారు. ఓ ఆలయ నిర్మాణంలో భాగంగా తమకు ఆకుపూజ చేయించడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. స్పందించిన ఇన్‌చార్జ్‌ తహసీల్దార్‌, ఎస్‌ఐ తదితరులు కలిసి మల్లినమడుగు గ్రామంలో పర్యటించారు. దళితులు, పెద్ద మనుషులతో సమావేశమై చర్చించారు. ఆలయంలో పూజ చేయించుకోవడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని గ్రామ పెద్దలు అధికారులు ఎదుట తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్‌ ఎంపీడీఓ రామరావు, ఏఎస్‌ఐ బాలాజీ, ఆర్‌ఐ గిరయప్ప, సర్వేయర్‌ కిరణ్‌ కుమార్‌, వీఆర్వో గిరిష్‌ కుమార్‌, కానిస్టేబుల్‌ నరసింహ మూర్తి, కేవీపీఎస్‌ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు



బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అగళి: బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఐసీడీఎస్‌ సీడీపీఓ నాగమల్లేశ్వరి హెచ్చరించారు. మండల పరిధిలోని పీ బ్యాడగేర జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో గురువారం ఆర్డీటీ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించారు. ఆర్డీటీ సెక్టార్‌ టీం లీడర్‌ ఆదినారాయణ అధ్యక్షతన లఘుచిత్రాల ద్వారా సమాజంలో ఎదురయ్యే సమస్యలను (బాల్య వివాహలు, లైంగిక వేధింపులు) ఎలా ఎదుర్కోవాలో వివరించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం బాల్య వివాహాలకు సహకరిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎక్కడైనా బాల్య వివాహలు చేయాలని ప్రయత్నిస్తే వెంటనే టోల్‌ ఫ్రీ నంబర్లు 1098, 100, 112 నంబర్లకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటారని తెలియజేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ పద్మ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ గుర్రన్న, ప్రధానోపాధ్యాయులు, ఆర్డీటీ సెక్టార్‌ టీం లీడర్‌ ఆదినారాయణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

12న వేలం పాట

మడకశిర: మున్సిపాలిటీ పరిధిలోని దినసరి కూరగాయల మార్కెట్‌, వారపు సంత, బస్టాండ్‌ పార్కింగ్‌ స్థలాలకు సంబంధించిన సుంకాల వసూలు హక్కుల లీజుకు ఈనెల 12న ఉదయం 11 గంటలకు మున్సిపల్‌ కార్యాలయంలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు కమిషనర్‌ రంగస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. రూ.3 లక్షల చొప్పున డిపాజిట్‌ చేసి వేలం పాటలో పాల్గొనాలి ఉంటుందని పేర్కొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్‌: గౌడనహళ్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలు వేసవిలో తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టామని సర్పంచ్‌ పుట్టమ్మ తెలిపారు. గురువారం జమ్మానిపల్లి, తురుకవాండ్లపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న పైపులైన్‌, గేట్‌ వాల్‌, బోరు మోటార్‌కు మరమ్మతులు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే తమకు సమాచారం అందిస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. అదే విధంగా వీధి దీపాలకు మరమ్మతులు చేస్తామన్నారు.

భోజనం నాణ్యతగా ఉండాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సామాజిక తనిఖీ బృందం

గుడిబండ: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌ను (డీఆర్‌పీఎస్‌) సామాజిక తనిఖీ బృందం సభ్యులు లక్మయ్య, పెంచల్‌ ప్రసాద్‌ గురువారం సందర్శించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన మెనూ అమలు తీరును పరిశీలించారు. అనంతరం పరిశుభ్రత, తాగునీరు తదితర వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని అధికారులకు తెలిపారు. వారు మాట్లాడుతూ.. తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రధానోపాధ్యాయుడు గోవిందప్పకు సూచించారు. విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం సక్రమంగా పెట్టాలన్నారు. దీనిపై ఎప్పటికప్పుడు స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలన్నారు.

వ్యక్తి పై దాడి

సోమందేపల్లి : రూకలపల్లిలో పొలంలోకి పశువులను తోలిన ఘటనలో ఓ వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేశాడు. వివరాలు.. గ్రామానికి చెందిన జి.కిష్టప్ప పొలంలోకి అదే గ్రామానికి చెందిన వి.కిష్టప్ప తన ఆవులను తోలాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. జి. కిష్టప్పపై వి.కిష్టప్ప దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

11 నుంచి మిట్టబండ ఆంజనేయస్వామి జాతర

మడకశిర: పట్టణంలోని మిట్టబండ ఆంజనేయ స్వామి జాతర ఈనెల 11వ తేదీన ప్రారంభమై 20 వరకూ జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11న సీతారాముల కల్యాణం, 12న బ్రహ్మరథోత్సవం, 20న ముత్యాల పల్లకీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మారెమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ



హెచ్‌టీ హళ్లిలో మారెమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

రొళ్ల: మండల పరిధిలోని హెచ్‌టీ హళ్లి గ్రామంలో గురువారం గ్రామ దేవత మారెమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ప్రస్తుతం ఆలయం లేకపోవడంతో గ్రామం మధ్యలో ఓ చోట (గద్దిగా) పూజలు చేసేవారు. దాదాపు రూ.5 లక్షల వ్యయంతో గ్రామస్తులందరూ కలిసి ఆలయం నిర్మాణానికి చర్యలు చేపట్టారు.

ఉర్దూ పాఠశాలను తొలగించొద్దు



ఆందోళన చేస్తున్న ముస్లింలు

పావగడ: పట్టణంలోని పాత ప్రభుత్వ ఉర్దూ పాఠశాలను తొలగించొద్దని విద్యార్థులు, తల్లితండ్రులు, ఎస్‌డీఎంసీ పదాధికారులు, సభ్యులు కోరారు. గురువారం పాఠశాల ఆవరణలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా హిదాయత్‌ మాట్లాడుతూ.. పాఠశాలను తొలగించకుండా మౌలానా అబ్దుల్‌ కలాం పాఠశాలకు వచ్చే ప్రత్యేక నిధులతో ఉర్దూ పాఠశాలను సైతం అభివృద్ధి చేయాలన్నారు. నూతన భవనాన్ని నిర్మించాలని కోరారు. ఉన్నత పదవుల్లో ఉన్న పాఠశాల పూర్వ విద్యార్థులు తమకు తోచినంత ఆర్థిక సాయం అందించి ఉర్దూ పాఠశాల అభివృద్ధికి కంకణం కట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు ఆర్‌కే నిసార్‌, శాకీర్‌ అహ్మద్‌, యునుస్‌, కౌన్సిలర్‌ రియాజ్‌ అహ్మద్‌, సికందర్‌, హోటల్‌ షఫీ, జిమ్‌ షఫీ, జబీఉల్లా తదితరులు పాల్గొన్నారు. ఈసీఓ శివకుమార్‌కు వినతిపత్రం అందించారు.

'స్టెమీ'తో గుండెకు భరోసా



ఫ్లెక్సీని విడుదల చేస్తున్న వైద్యులు, సిబ్బంది

పెనుకొండ: స్టెమీ కార్యక్రమం ద్వారా గుండెకు భరోసా కల్పిస్తామని కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్‌ సూపరింటిండెంట్‌ మోహన్‌నాయక్‌ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్‌లో స్టెమీ కార్యక్రమానికి సంబంధించిన ఫ్లెక్సీని విడుదల చేశారు. హెల్త్‌ సెంటర్‌లో గుండె జబ్బులకు అత్యవసర చికిత్సలు అందిస్తున్నట్లు సూపరింటెండెంట్‌ తెలిపారు. గుండెపోటు లక్షణాలు, ఛాతినొప్పి, గుండెదడ, స్పృహ కోల్పోవడంతదితర లక్షణాలను వారిని గంటలోపు కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్‌కు తీసుకొస్తే తగిన వైద్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సలహా సంఘం సభ్యులు చంద్రశేఖర్‌, త్రివేంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కెంచమాంబ దేవి ఉత్సవాలు ప్రారంభం



విద్యుత్‌ వెలుగుల్లో ఆలయం

అమరాపురం: మండల పరిధిలోని గౌడనకుంట గ్రామంలో కెంచమాంబ దేవి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. భక్తుల సహకారంతో నూతనంగా నిర్మించిన ఆలయాన్ని అర్చకులు, ఆలయ కమిటీ యాజమానులు ప్రారంభించారు. అనంతరం వివిధ రకాల హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్‌ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

నేడు విగ్రహ ప్రాణ ప్రతిష్ట

స్థానికంగా నిర్మించిన ఆలయంలో కెంచమాంబ దేవి నూతన విగ్రహన్ని ప్రాణ ప్రతిష్టాపన చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పీఎల్డీ బ్యాంక్‌ అధ్యక్షుడిగా శేషగిరి



శేషగిరిని సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక పీఎల్‌డీ (ప్రాథమిక సహకార వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి) బ్యాంక్‌ అధ్యక్షుడిగా కడమలకుంట ఎన్‌ శేషగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని పీఎల్డీ బ్యాంకు కార్యాలయంలో గురువారం జరిగిన అధ్యక్ష స్థానం ఎన్నికల్లో మాజీ మంత్రి వెంకటరమణప్ప సూచనల మేరకు శేషగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే మారమ్మనహళ్లి అనితమ్మ ఉపాధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శేషగిరి 2015–18లో ఒకసారి అధ్యక్ష పదవి చేపట్టారు. ఈ సందర్భంగా శేషగిరి మాట్లాడుతూ.. రుణాల వసూళ్లకు అధిక ప్రాధాన్యత కల్పించి డైరెక్టర్ల సహకారంతో బ్యాంకును ఆర్థిక ప్రగతి దిశగా నడిపిస్తానన్నారు. కార్యక్రమంలో స్థానిక బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు సుదేశ్‌ బాబు, డీసీసీ బ్యాంకు డైరెక్టర్‌ నరసింహయ్య, పీసీసీ సభ్యుడు పాపణ్ణ, స్థానిక మున్సిపల్‌ అధ్యక్షుడు రాజేశ్‌ పాల్గొన్నారు.

కొత్తూరు గంగమ్మకు అరుదైన ప్రశస్తి



గంగమ్మకు ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం

పావగడ: నీకే పురం గ్రామ పంచాయతీ పరిధిలోని 246 కుటుంబాలకు నరేగా పథకం కింద వంద రోజుల పని దినాలను కల్పించి పేదల అభివృద్ధికి మేట్‌ కొత్తూరు గంగమ్మ బాటలు వేసింది. సేవా నిరతిని గుర్తించిన ప్రభుత్వం ఆమెకు రాష్ట్ర స్థాయి కాయక బంధు (మేట్‌) ప్రశస్తిని అందించింది. గురువారం బెంగళూరులోని అంబేద్కర్‌ భవన్‌లో గ్రామీణాభివృద్ధి పంచాయతీ రాజ్‌ శాఖ ఆధ్వర్యంలో ప్రశస్తి అందజేశారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్‌ శాఖ మంత్రి ప్రియాంక ఖర్గే చేతుల మీదుగా 'కాయక బంధు' ప్రశస్తిని గంగమ్మ అందుకుంది. కార్యక్రమంలో తుమకూరు జిల్లా సీఎస్‌ ప్రభు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.